క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ప్రభాకర్, అడిషనల్ ఈఓ

ఆమదాలవలస: ఆమదాలవలస గ్రూప్ దేవాలయాల అడిషనల్ ఈఓగా సి.హెచ్.ప్రభాకర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గత కొంత కాలంగా ఈఓ పోస్టు ఇక్కడ ఖాళీగా ఉండటంతో మందస గ్రూప్ దేవాలయాల ఈఓగా పనిచేస్తున్న ప్రభాకర్‌ను ఇక్కడ నియమించారు. ఆమదాలవలసలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో గల కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఆమదాలవలస: స్థానిక మున్సిపాలిటీ పరిధి రావికంటిపేటలో ఆదివారం సాయంత్రం రచ్చబండ వద్ద జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆమదాలవలస ఎస్‌ఐ ఎస్.బాలరాజు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చాతుర్మాస దీక్ష ప్రారంభం


భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

నరసన్నపేట: మండలంలోని కిల్లాంలో గల లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో నరసన్నపేటకు చెందిన గీతా మండలి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణాన్ని ఆదివారం నిర్వహించారు. చాతుర్మాస దీక్షను ప్రారంభించారు. రానున్న నాలుగు నెలలపాటు ఆలయంలో భగవద్గీత పారాయణం చేపట్టనున్నట్లు గీతా మందిరం అర్చకుడు సూరిబాబు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భగవద్గీత పారాయణం చేపట్టారు.

భూములు వదిలే ప్రసక్తే లేదు


మాట్లాడుతున్న గంగరాపు సింహాచలం

బూర్జ: మండలంలోని అన్నంపేట గ్రామంలో బలహీన వర్గాల ప్రజల సాగులో ఉన్న భూములను వదిలే ప్రసక్తే లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం అన్నారు. అన్నంపేటలో దళితులు, పేదల సమక్షంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ.. దళితులకు ఇచ్చిన డీ పట్టాల్లో 50 ఏళ్లుగా సాగు చేస్తున్నారన్నారు. ఆ భూములపై తప్పుడు హక్కు పత్రాలు సంపాదించి కోర్టులో కేసు వేయడం అన్యాయమన్నారు. విశాఖపట్నానికి చెందిన మంగపల్లి సూర్యారావు మండలానికి వచ్చి దళితులు, పేదలను వేధించడం తగదన్నారు. పేదల సాగులో ఉన్న భూములు వారికే చెందాలన్నారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భూ పోరాటాలు చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ సమావేశంలో దంత శ్రీరాములు, కులాపు అప్పలనాయుడు, బట్న గణపతి, దన్నాన లక్ష్మి, పొన్నాడ గౌరమ్మ, సాకేటి అప్పారావు, కూరాకుల అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోండి

ఆమదాలవలస: కళలను ఆదరించి, కళాకారులను ఆదుకోవాలని కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పేడాడ ధనుజయరావు అన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కళాకారుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సంఘ సహాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు, సంఘ ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దాస్యం లక్ష్మణరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మినీ కంటైనర్ ఢీకొని వృద్ధుడు మృతి

- తలుపులమ్మను దర్శించుకొని తిరిగి వస్తుండగా ప్రమాదం


గురన్న మృతదేహం

కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం గ్రామ పరిధిలోని భీమాస్ హోటల్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ కె.లక్ష్మణరావు అందించిన వివరాల ప్రకారం.. బయ్యవరం వద్ద రోడ్డు దాటుతున్న శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలంలోని బోరిగివలస గ్రామానికి చెందిన రాజాపు గురన్న (64)ను యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న మినీ కంటైనర్ వేగంగా వచ్చి ఢీకొని పరారయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. తమ గ్రామస్తులతో కలిసి మినీ బస్సులో తునిలో తలుపులమ్మ ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి వస్తూ మార్గమధ్యంలో బయ్యవరం వద్ద టీ తాగి గురన్న రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుని గ్రామానికి చెందిన ముద్దాడ శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో రెండు బృందాలుగా పరారైన వాహనాన్ని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

కాలువలు ఇలా.. సాగునీరు ఎలా?


నరసన్నపేట వద్ద గుర్రపుడెక్కతో ఉన్న కిల్లాం ఛానల్


కానుకుర్తివానిపేట వద్ద జంగిల్‌తో ఉన్న శ్రీఆర్ నడగాం ఛానల్

- పూడిక, గుర్రపుడెక్కతో నిండిన ఛానళ్లు, కాలువలు
- ఖరీఫ్ సీజన్ ప్రారంభం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

నరసన్నపేట: ఒకవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు పొలం పనుల్లో బిజీ..బిజీ ఉన్నారు. మరోవైపు నరసన్నపేట మండలంలో సాగునీటి కాలువలు పూడిక, గుర్రపు డెక్కతో నిండి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. షట్టర్ల మరమ్మతులు చేయలేదు. కనీసం కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క తొలగించినా కొంతవరకు సాగునీరు అందుతుంది. మండలంలో ప్రధాన కాలువలైన కిల్లాం, నడగాం, ఉర్లాం ఛానళ్లలో పూడిక, గుర్రపుడెక్క అధికంగా ఉంది. వందలాది ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ ఛానళ్లలో పూడిక తీయాలని రైతులు కోరుతున్నారు.

కూటమి కార్యకర్తలకే మేలు..

కొన్నిచోట్ల కాలువ పనులు చేస్తున్నా.. కూటమి కార్యకర్తలు వారికి నచ్చినచోట చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నరసన్నపేటకు ఆనుకొని కిల్లాం ఛానల్‌లో గుర్రపు డెక్క అధికంగా ఉంది. దీనిని తొలగించకపోతే నీరు కిందకు వెళ్లదు. నడగాం, ఉర్లాం చానళ్లల్లో కూడా పూడికతీత పనులు చేపట్టాలి. జులై 15వ తేదీన ఎడమ కాలువల్లో సాగునీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లోగానే కాలువల్లో పనులు చేయాలని రైతులు కోరుతున్నారు. లుకలాం, కామేశ్వరిపేట, కొత్తపోలవలస, ముషిడిగట్టు, పోతయ్యవలస, గోపాలపెంట, తదితర శివారు గ్రామాలకు సాగు నీరు అందేలా వంశధార ఇంజినీర్లు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు వచ్చేలా చూడండి

శివారు భూములున్న లుకలాం పరిధిలో కాలువ పనులు చేపట్టాలి. పలుచోట్ల ఉపాధి కూలీలతో పనులు చేపట్టినా.. అంతగా ఫలితం ఉండటం లేదు. జేసీబీలతో పనులు చేపట్టి ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు వచ్చేలా చూడాలి.
– చింతల సత్యనారాయణ, రైతు, లుకలాం, నరసన్నపేట మండలం

పూడిక తొలగించాలి

శ్రీ ఆర్ నడగాం ఛానల్ పరిధిలో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు అవుతుంది. ఈ కాలువలో పూడికతీత పనులు నిర్వహించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. వెంటనే పూడిక తొలగించి సాగునీటి సరఫరాను సక్రమంగా నిర్వహించాలి. గడిచిన సీజన్‌లో నీరు సక్రమంగా రాక ఇబ్బంది పడ్డాం.
– కింతలి చలపతి, కానుకర్తివానిపేట, నరసన్నపేట మండలం

పనులు చేస్తున్నాం..

నరసన్నపేట, పోలాకి మండలాల్లోని వంశధార కాలువల్లో 41 పనులు రూ.2 కోట్లతో మంజూరయ్యాయి. ఈ పనులు ప్రస్తుతం చేస్తున్నాం. మిగిలిన కాలువల్లో కూడా అవకాశం మేరకు అత్యవసర రీత్యా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు ఆందోళన చెందవద్దు. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.
– రామలక్ష్మి ,వంశధార డీఈ, నరసన్నపేట

పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు


బొడ్డేపల్లి రమేష్‌కుమార్‌ను అభినందిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- బొడ్డేపల్లి రమేష్‌కుమార్‌కు రాష్ట్ర స్థాయి పదవి దక్కడం అభినందనీయం
- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తున్న మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్‌కు పార్టీ అధిష్టానం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించి, తగిన గుర్తింపు ఇచ్చిందని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రమేష్‌కుమార్ ఇంటికి ఆదివారం వెళ్లి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం కల్పిస్తున్న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం చంద్రబాబు, కూటమి నాయకులు ప్రజలకు చేసిన మోసాలను బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఈ నెల 8న వైఎస్సార్ జయంతిని ఆమదాలవలస పార్టీ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ, మండలం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. తాను యుక్తవయస్సులోనే మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావుతో కలిసి పనిచేశానన్నారు. ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. పార్టీలో పదవులు ఆశించకుండా పనిచేశానని, 12 ఏళ్ల తరువాత పార్టీ తనను రాష్ట్ర స్థాయి పదవిని ఇచ్చి గౌరవించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు, పార్టీ పెద్దలకు, చింతాడ రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మెట్టక్కివలస ప్రాంతం ప్రజలతోనే తనకి ఇంత గుర్తింపు వచ్చిందని, వారి రుణం తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పొన్నాడ రామారావు, హనుమంతు ప్రసాద్‌రావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, చింతాడ వెంకటరమణ, బొడ్డేపల్లి అజంతాకుమారి, దుంపల చిరంజీవిరావు, తిర్లంగి వరహాలనాయుడు, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి వెంకటసత్యం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పొన్నాడ చిన్నారావు, నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు కూన రామకృష్ణ, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు పాదిలాపు తిరుపతిరావు, యువత అధ్యక్షుడు బొడ్డేపల్లి విశ్వేశ్వరరావు(రాజు), విద్యార్థి విభాగం అధ్యక్షుడు మామిడి కిరణ్, మున్సిపాలిటీ జనరల్ సెక్రటరీలు మద్దిల రంజిత్, సువ్వారి కోటేశ్వరరావు, కార్యదర్శులు కుప్పిలి సత్యనారాయణ, సున్నగాపుల చిన్నారావు, లింగిబేరి సుధ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతికి తరలిరండి

నరసన్నపేట: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. నాలుగు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులందరూ వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు నరసన్నపేట మండలం మడపాం గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తామన్నారు. 9 గంటలకు నరసన్నపేట, 9.30 గంటలకు ఈదులవలస, 10 గంటలకు సుసరాం, 10.30 గంటలకు పిన్నింటిపేట, 11 గంటలకు గాతలవలస, 11.30 గంటలకు ఉర్లాంల్లోని వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం 12 గంటలకు ముద్దాడపేట, 12.30 గంటలకు కొమనాపల్లి, 1 గంటలకు జోనంకి, 1.30 గంటలకు సారవకోటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు అందరూ మడపాం గ్రామం వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

ధర్మాన కృష్ణదాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు


మబగాంలో గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ధర్మాన కృష్ణదాస్

పోలాకి: మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు ముందస్తు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సోమవారం కృష్ణదాస్ స్థానికంగా అందుబాటులో ఉండటం లేదని తెలుసుకున్న పార్టీ నాయకులు ఆదివారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మబగాం గ్రామంలోని ఆయన నివాసం వద్ద గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్ చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, అభిమానులను కృష్ణదాస్ కలిశారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడి తిరువీధిని ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు భక్తులు హారుతులిచ్చారు.


ఉత్సవ మూర్తులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

9న వైఎస్సార్‌సీపీ సమావేశం


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఈ నెల 9వ తేదీన మండలంలోని రావికంటిపేట సమీపంలో గల శ్రీనివాస కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ తెలిపారు. ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, అగ్ర నాయకుల ఆదేశాలతో ఈ సమావేశం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


కుసుమంచి హరీష్

సరుబుజ్జిలి: వైఎస్సార్‌సీపీ బోలపేతానికి తనవంతు కృషి చేస్తానని పార్టీ మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ కుసుమంచి హరీష్ అన్నారు. పార్టీ పదవి దక్కడం పట్ల అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌కు ఆదివారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

కొత్తూరు: తొలి ఏకాదశి పురస్కరించుకొని మండలంలోని మహసింగి సమీపంలో గల వరహా లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. వేద పండితులు గౌరీశ్వరరావు శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తొలి ఏకాదశి పూజలు..

హిరమండలం: ఎల్.ఎన్.పేట, హిరమండలం మేజర్ పంచాయతీల పరిధిలో గల జగన్నాథస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు. ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగా హిందువులు భావిస్తారని అర్చకులు తెలిపారు.

నీలమణిదుర్గ ఆలయంలో..

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా అమ్మవారి ఆలయానికి తెల్లవారుజామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కుంకుమ, ప్రత్యేక పూజలు చేశారు.

మత్తుతో జీవితాలు చిత్తు

హిరమండలం: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాసనం చేసుకోవద్దని ఎస్‌ఐ ఎండీ యాసిన్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని సుభలయలో సంకల్ప కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

డ్రమ్ సీడర్‌తో లాభాలు


సింగుపురంలో డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేస్తున్న దృశ్యం

- పాతపట్నం నియోజకవర్గంలో 465 ఎకరాల్లో వరి సాగు
- ఎకరాకు 40 నుంచి 45 బస్తాల దిగుబడి
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

పాతపట్నం: అధునాతన పద్ధతుల్లో, తక్కువ సమయంలో స్వల్ప పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించడంపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి కూలీలతో పనిలేకుండా డ్రమ్‌సీడర్ ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు రైతులకు శిక్షణ ఇస్తున్నారు. డ్రమ్ సీడర్ ద్వారా వరి పంట సాగు చేస్తే ఎకరాకు 40 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు, ఇప్పటికే ఈ విధానంలో వరి పంట పండిస్తున్న రైతులు చెబుతున్నారు. పాతపట్నం మండలంలోని కాపు గోపాలపురం, గంగువాడ, లాబర, సింగుపురం, సీది, పాతపట్నం, మద్దుమర్రి గోపాలపురం, పెద్దలోగిడి, కొరసవాడ, తీమర గ్రామాల్లో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు ఆధ్వర్యంలో 300 ఎకరాల్లో, మెళియాపుట్టి మండలంలోని కొసమాల, పట్టుపురం, పెద్దపద్మపురం, మర్రిపాడు-సి గ్రామాల్లో 50 ఎకరాల్లో, ఎల్.ఎన్.పేట 30 ఎకరాల్లో, హిరమండలం 45 ఎకరాల్లో, కొత్తూరు 40 ఎకరాల్లో డ్రమ్ సీడర్ ద్వారా పలు రకాల విత్తనాలను నాటారు.

నారుమడితో పనిలేదు

డ్రమ్‌సీడర్ ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు ఎకరాకు 16 కేజీల విత్తనాలను సిద్ధం చేసుకోవాలి. వరి నారుమడి లేకుండా నేరుగా దమ్ము పట్టి విత్తనాలు నాటుకోవాలి. విత్తనాలు నాటిన మూడు రోజుల తర్వాత ప్రకృతి వ్యవసాయంలో తయారు చేసిన కలుపు మందులు వేసుకోవాలి. కూలీల ఖర్చు ఆదా అవుతుంది. ఆకుమడి తయారు చేయాలి. తర్వాత కలుపు నివారణ చేపట్టాలి. అనంతరం ఆకు తీత, దమ్ములో ఉడుపు, కలుపుతీత వంటి పనులకు కూలీల అవసరం ఉంటుంది. సాధారణంగా ఎకరా వరి సాగుకు రూ.15 వేల వరకు ఖర్చు అవుతుంది. నేరుగా డ్రమ్‌సీడర్‌తో ప్రకృతి సాగు చేస్తే ఎకరాకు ఐదు వేలు వరకు ఆదా అవుతుందని వ్యవసాయ ప్రకృతి వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

పెట్టుబడి తగ్గుతుంది



డ్రమ్ సీడర్ పద్ధతిలో ప్రకృతి సాగు చేసే ఐదు వేల వరకు పెట్టుబడి తగ్గుతుంది. కూలీలతో నిమిత్తం లేకుండా సాగు చేయచ్చు. దిగుబడులు కూడా సంప్రదాయ సాగుతో పోల్చుకుంటే అధికంగానే వస్తున్నాయి. ఎరువులు, రసాయనాల వాడకం కూడా తగ్గింది. మొత్తం మీద డ్రమ్ సీడర్‌తో ప్రకృతి వ్యవసాయం సాగు లాభదాయకంగా ఉంది.
– కరకవలస దుర్గాప్రసాద్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్, పాతపట్నం

అవగాహన కల్పిస్తున్నాం



ఆధునిక పద్ధతుల్లో సాగు చేసేందుకు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాం. డ్రమ్ సీడర్ విధానం ద్వారా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. సాగుచేసే ప్రక్రియను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సంప్రదించి మరీ రైతులకు సమాచారం, సలహాలు, సూచనలు ఇస్తున్నాం. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఐదేళ్ల నుంచి డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేస్తున్నారు.
– పూజారి సత్యనారాయణ, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్, శ్రీకాకుళం

తులసీ దళార్చన

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం తులసీ దళార్చన చేపట్టారు. ఆలయ అర్చకుడు చామర్తి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సారవకోట: ఈ నెల 8వ తేదీన కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి డివిజన్ ఈఈ శంకరరావు ఆదివారం తెలిపారు. సారవకోట మండలంలోని జరాలి, చంద్రయ్యపేట, మదనాపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.